

సర్దేశారు!

తహసీల్దార్ల సర్దుబాటులో కీలక అధికారి కిరికిరి | సహకరించిన సెక్షన్ ఉద్యోగి

- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుకు చెక్
- సీసీఎల్ఏ నిబంధనలకు తిలోదకాలు
- కలెక్టర్‌నూ ఏమార్చిన అధికారి
- భారీగా నగదు మారినట్టు ప్రకంపనలు
- సర్దుబాటు ప్రక్రియ పూర్తయ్యాక దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన అధికారి

జిల్లాలో తహసీల్దార్ల సర్దుబాటులో అక్రమాలు జరిగాయా? మంత్రులు, శాసనసభ్యుల మాటను కూడా పక్కనపెట్టి తమదైన శైలిలో కీలక అధికారి, మరో ఉద్యోగి తెరవెనుక చక్రం తిప్పారా? ఇష్టానుసారంగా తహసీల్దార్లను సర్దుబాటు జాబితా తయారు చేశారా? సీసీఎల్ఏ నిబంధనలను తుంగలో తొక్కి కలెక్టర్‌ను సైతం పక్కదారి పట్టించారా? వీటన్నిటికీ అవుననే సమాధానమే వస్తోంది. ఈ వ్యవహారంపై రెవెన్యూ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అక్రమాలకు పాల్పడినవారికి కోరుకున్న ప్రాంతం లభించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. బుధవారం రాత్రి తహసీల్దార్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన వెంటనే కీలక అధికారి దీర్ఘకాలిక సెలవుపై చెక్కేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో పనిచేస్తున్న 35 మంది తహసీల్దార్లను ఎన్నికల సంఘం ఈ ఏడాది ఫిబ్రవరిలో కాకినాడ, రాజమండ్రి, అంబెడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీ చేసింది. వీరంతా ఇటీవల ఆ జిల్లాల నుంచి రిలీవ్ అయ్యి కృష్ణాజిల్లాకు వచ్చారు. ఇక్కడి నుంచే అసలు కథ ప్రారంభమైంది. కొందరు తహసీల్దార్లు తమకు తెలిసిన అధికార కూటమి నాయకులు ద్వారా శాసనసభ్యుల వద్దకు వెళ్లి సిఫార్సు లేఖలు తెచ్చుకుని కలెక్టరేట్‌లో సమర్పించారు. ఇటీవల జరిగిన సాగునీటి సలహామండలి సమావేశం నిమిత్తం మచిలీపట్నం వచ్చిన శాసనసభ్యులు తాము సూచించిన విధంగా తహసీల్దార్లను తమ నియోజకవర్గాల్లోని మండలాలకు సర్దుబాటు చేయాలని కలెక్టర్‌కు చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. కలెక్టర్ ఈ బాధ్యతను జిల్లా రెవెన్యూ విభాగంలో పనిచేసే కీలక అధికారికి అప్పగించారు. ఈ అధికారి కలెక్టరేట్‌లోని తహసీల్దార్ల బదిలీలను పర్యవేక్షించే సెక్షన్ ఉద్యోగితో కుమ్మక్కయి తహసీల్దార్ల సర్దుబాటు జాబితాను తయారు చేయించారు. ఈ జాబితా తయారు చేసే సమయంలో తమను నేరుగా కలుసుకుని ప్రసన్నం చేసుకున్నవారికి కోరుకున్న మండలాలను కేటాయించడం ప్రస్తుతం వివాదాస్పదమైంది. జాబితాను కలెక్టర్ వద్దకు బుధవారం రాత్రి తీసుకువెళ్లిన అధికారి దాదాపు గంట సమయంపాటు ఏకాంతంగా చర్చలు జరిపి కలెక్టర్‌తో సంతకం చేయించినట్టు కలెక్టరేట్ ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఇద్దరు శాసనసభ్యులు, ఒక మాజీ ఎంపీ కోడూరుకు వేరే తహసీల్దారును నియమించాలని సిఫార్సు చేసినా ఈ కీలక అధికారి తనదైన శైలిలో వ్యవహరించి శ్రీనునాయక్‌ను కోడూరు మండలానికి పంపడంపై అధికార పార్టీ నాయకులు గుర్రుగానే ఉన్నారు.

నిబంధనలకు తిలోదకాలు

జిల్లాలో 35 మంది తహసీల్దార్లను సర్దుబాటు చేశారు. ప్రస్తుతం జరిగే సర్దుబాటు ప్రక్రియలో గతంలో పనిచేసిన మండలంలో, సొంత డివిజన్‌లో తహసీల్దార్లకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వకూడదని సీసీఎల్ఏ ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాల్లో సూచించింది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం కేఆర్‌సీసీ ప్రత్యేక తహసీల్దార్‌గా పనిచేసిన డి.ప్రశాంతి ఎన్నికల విధుల్లో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం జరిగిన తహసీల్దార్ల సర్దుబాటులో ఆమెను మళ్లీ మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం కేఆర్‌సీసీ ప్రత్యేక తహసీల్దార్‌గా నియమించారు.

కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి..

తహసీల్దార్ల సర్దుబాటు జాబితాల తయారీలో పొరపాటు దొర్లిందని కలెక్టరేట్ ఏ-3 సెక్షన్ ఉద్యోగి చెబుతున్నారు. పొరపాటు జరిగినా కలెక్టర్‌తో సంబంధిత కీలక అధికారి ఎలా సంతకం చేయించారని అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఎన్నికల సమయంలో పనిచేసిన ఉద్యోగులకు గౌరవ వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన జిల్లాస్థాయి అధికారి తీరుపై ఉద్యోగులు వ్యతిరేకతను వ్యక్తం చేయడంతో ఇటీవల వారం రోజులపాటు సదరు అధికారి సెలవు పెట్టారు. ప్రస్తుతం తహసీల్దార్ల సర్దుబాటులో తనదైన శైలిలో వ్యవహరించిన కీలక అధికారి ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

వీటికి సమాధానమేది?

- తహసీల్దార్ల సర్దుబాటు ప్రక్రియలో రెవెన్యూ విభాగంలోని కీలక అధికారి, మరో సెక్షన్ ఉద్యోగి లక్షల్లో నగదు పోగేసుకున్నారనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.
- గతంలో అవనిగడ్డ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనునాయక్ మండలి బుద్ధప్రసాద్‌కు వ్యతిరేకంగా పనిచేశారు. దీంతో సదరు అధికారిని అవనిగడ్డ నుంచి పంపేశారు. ఈ తహసీల్దార్‌ను తన నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వవద్దని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే మాటను కూడా లెక్క చేయకుండా కీలక అధికారి అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండలానికి శ్రీనునాయక్‌ను తహసీల్దార్‌గా నియమించారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారిందని రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుకుంటున్నారు.
- గన్నవరం తహసీల్దార్ సీతపవన్‌కుమార్ ఎన్నికల విధుల నిమిత్తం గన్నవరం మండలం వచ్చారు. సీసీఎల్ఏ నుంచి వచ్చిన ఆయన్ను ప్రస్తుతం మండలం నుంచి పంపాలి. కానీ పాతస్థానంలోనే కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గన్నవరం తహసీల్దార్ వ్యవహారంలోనూ కీలక అధికారి తనదైన శైలిలో వ్యవహరించారనే అపప్రదను మూటగట్టుకున్నారు.
- ఈనెల 28వ తేదీతో పదవీ విరమణచేసే తహసీల్దార్ మల్లికార్జునరావును గుడ్లవల్లేరు తహసీల్దార్‌గా నియమించడంలోనే ఏదో మతలబు జరిగిందని రెవెన్యూ వర్గాలు చెప్పుకుంటున్నాయి.
- గతంలో పామర్రు మండల తహసీల్దార్‌గా వీవీ భరత్‌రెడ్డి పనిచేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేకు ఆయన పూర్తిస్థాయిలో అనుకూలంగా పనిచేసి భూ వివాదాల్లో చిక్కుకున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ల బదిలీల్లో భరత్‌రెడ్డి పెడన నియోజకవర్గంలోని ఏదైనా మండలానికి తహసీల్దార్‌గా వస్తారనే ప్రచారం జరిగింది. అనుకున్నట్టుగానే ఆయనను పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి తహసీల్దార్‌గా నియమించారు. ఈ వ్యవహారం వివాదాస్పదమవుతోంది.

ఆత్మహత్యకు యత్నించిన
సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- మరో ఉద్యోగి సురక్షితం
- అనుమానాస్పద మృతిగా కేసు
- ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలే కారణం?
- కుట్ర ఉందని మృతుడి బంధువుల ఆరోపణ



జోగి నాగవరప్రసాద్ (ఫైల్)

మచిలీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు కోలుకుని హైదరాబాద్ వెళ్లారు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన గొడవల వల్లే ఈ దారుణం జరిగిందని మృతుని బంధువులు చెబుతున్నారు. చిలకలపూడి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెడన మండలం లంకలకలవగుంటకు చెందిన జోగి నాగవరప్రసాద్ (38), హైదరాబాద్‌కు చెందిన ఎం.చంద్రశేఖర్ (చంద్ర) సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు హైదారాబాద్‌లో పనిచేస్తున్నారు. కొంతకాలంగా మచిలీపట్నం కేంద్రంగా రొయ్యల వ్యాపారం చేస్తున్నారు. జె.మధు అనే వ్యక్తిని రొయ్యల కొనుగోలు వ్యవహారంలో మధ్యవర్తిగా పెట్టుకుని ఇక్కడ కొనుగోలు చేసిన రొయ్యలను ఒంగోలు తదితర ప్రాంతాల్లోని రొయ్యల కంపెనీలకు విక్రయిస్తూ ఉంటారు. వీరి వ్యాపారం ఒడిదుడుకులకు గురైంది. దీంతో రెండురోజుల క్రితం మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఒక లాడ్జిలో నాగవరప్రసాద్, చంద్ర దిగారు. వ్యాపారంలో పెద్దమొత్తంలో అప్పులపాలు కావడంతో తీర్చే విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈనెల 30వ తేదీన తెల్లవారుజామున 3 గంటలకు లాడ్జిలో ఉన్న వీరు బీరులో కలుపు నివారణ కోసం వాడే మందును కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. లాడ్జి సిబ్బంది విషయాన్ని గ్రహించి పోలీసులకు, వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వీరిని మచిలీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మచిలీపట్నం నుంచి విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి బుధవారం తరలించారు. గురువారం నాటికి నాగవరప్రసాద్ ఆరోగ్యం పూర్తిగా విషమించడంతో వైద్యులు తమ వల్లకాదని అతన్ని ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే నాగవరప్రసాద్ బంధువులు మచిలీపట్నంలోని సర్వజన ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో కన్ను మూశారు. మృతదేహం మచిలీపట్నం సర్వజన ప్రభుత్వాసుపత్రిలో ఉంది.

కుట్రకోణం దాగి ఉందా?

ఆర్థికపరమైన అంశాల్లో తలెత్తిన ఇబ్బందుల నేపథ్యంలో ఇద్దరు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం, అందులో ఒకరు మరణించడంతో ఇందులో ఏదో కుట్ర కోణం ఉందని మృతుని బంధువులు అంటున్నారు. పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకునే సమయంలో చంద్ర ఎక్కువ మోతాదులో పురుగుమందును బీరులో కలిపి నాగవరప్రసాద్‌కు ఇచ్చి, తాను తక్కువ మోతాదులో తాగాడని మృతుని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో నాగవరప్రసాద్ ప్రాణాపాయ స్థితిలో ఉంటే చంద్ర కోలుకుని హైదరాబాద్ వెళ్లిపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. వ్యాపారం నిమిత్తం నాగవరప్రసాద్ పెడన మండలంలో తనకున్న భూమిని తాకట్టుపెట్టి అప్పులు చేశాడని చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు సేకరించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.



‘మల్లవల్లి’లో
భూ సమస్యలు పరిష్కరించాలి

- యూనిట్లు నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్న 121 ప్లాట్లను సేల్ అగ్రిమెంట్ చేయండి
- వివాదాల్లో ఉన్న 170 ప్లాట్లకు బదులుగా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేలా చర్యలు
- ఏపీఐఐసీ ఎండీకి మంత్రి టీజీ భరత్ ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడ (మోడల్ ఇండస్ట్రియల్ పార్క్)లో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన భూముల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సీఎంవో అధికారి కార్తికేయ మిశ్రాకు తమ సమస్యలను వివరించారు. “రాష్ట్ర విభజన తర్వాత సీఎం చంద్రబాబు పిలుపు మేరకు 350 మందికి పైగా పారిశ్రామికవేత్తలు దాదాపు రూ.1,100 కోట్ల పెట్టుబడులతో ఏపీలో యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు రాగా, ఏపీఐఐసీ ద్వారా 2018 జనవరిలో ప్రభుత్వం భూములు కేటాయించింది. భూ కేటాయింపులకు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు అప్పుడే చెల్లించాం. కానీ ఆ భూములు పలు వివాదాల్లో ఉన్నాయి. అప్పటి నుంచి భూముల రిజిస్ట్రేషన్, ఇండస్ట్రియల్ పార్కులో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పార్కులో భూములు పొందిన వారిపై టీడీపీ సానుభూతిపరులనే ముద్రవేసి కేన్సిలేషన్ నోటీసులు ఇచ్చారు. ఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేసి అనేక ఇబ్బందులకు గురిచేశారు. అయినా ధైర్యం చేసి యూనిట్లు ప్రారంభించిన వారికి విద్యుత్తు, నీరు, ఇతర సౌకర్యాలు కల్పించకుండా అడ్డంకులు సృష్టించారు. గత ప్రభుత్వం ఎన్ని విధాలుగా వేధించి, ఒత్తిళ్లు తీసుకువచ్చినా గట్టిగా నిలబడ్డాం. ఏపీఐఐసీ ద్వారా జారీ చేసిన కేన్సిలేషన్ లేఖలపై కోర్టులను ఆశ్రయించి పోరాడుతున్నాం. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 121 మంది పారిశ్రామికవేత్తలకు కేటాయించిన ప్లాట్లు యూనిట్లు నెలకొల్పడానికి రెడీగా ఉన్నాయి. మరో 170 ప్లాట్లు వివాదాల్లో ఉన్నాయి. సిద్ధంగా ఉన్న ప్లాట్లను సేల్ అగ్రిమెంట్ చేయాలి. వివాదాల్లో ఉన్న ప్లాట్లకు బదులుగా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలి” అని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి టీజీ భరత్... అప్పటికప్పుడే ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీకి ఆదేశాలు జారీ చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో యూనిట్లు నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్న 121 ప్లాట్లను సేల్ అగ్రిమెంట్ చేయడంతో పాటు వివాదాల్లో ఉన్న 170 ప్లాట్లకు బదులు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీనిపై మంత్రి భరత్‌కు మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌బీ చౌదరి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి బిజినెస్ ఫ్రెండ్లీ వాతావరణం ఉంటే ఏపీకి పరిశ్రమలు పరుగెత్తుకుంటూ వస్తాయని ఆయన స్పష్టం చేశారు.

పెరుగుతున్న ఫ్రస్టేషన్

- రెండు జిల్లాల్లో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల బదిలీల టెన్షన్
- కాసులు పట్టే పోలీస్ స్టేషన్ కోసం తీవ్ర ప్రయత్నాలు
- నాడు వైసీపీ విధేయులు.. నేడు కూటమి నేతలతో పైరవీలు
- రాజకీయ నాయకుల వద్దకు క్యూ
- సిఫారసు లేఖలతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- వెస్ట్‌జోన్‌లో ఆ నాలుగు స్టేషన్లంటే భలే మక్కువ



టెన్షన్.. టెన్షన్.. పోలీసుల బదిలీల్లో మునుపెన్నడూ లేనంత టెన్షన్. కాసులు కురిపించే స్టేషన్లకు ఎలాగైనా వెళ్లాలని ఎవరికి వారు పైరవీల్లో మునిగి తేలుతుంటే, తమ పరిస్థితి ఏమవుతుందోనని గతంలో వైసీపీకి వీర విధేయులుగా పనిచేసిన వారు కంగారు పడుతున్నారు. త్వరలో పోలీసు కమిషనరేట్‌తో పాటు కృష్ణాజిల్లాలోని అన్ని స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలను మార్పు చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టేశారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావులు.. డీఐజీ అశోక్‌కుమార్‌తో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈనెల 15 నాటికి మొత్తం మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు ఉండటంతో అందరి కన్ను ‘పెద్ద’స్టేషన్లపైనే పడింది. కావాల్సిన సీటు కోసం అటు నాయకుల చుట్టూ కొందరు ఖాకీలు ప్రదక్షిణలు చేస్తుండగా, ఇటు ఇన్‌స్పెక్టర్ల కోసం వస్తున్న సిఫార్సులతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

‘ఎన్టీఆర్’లో ఆ స్టేషన్లే ముద్దు

- ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ వెస్ట్‌జోన్‌లో సీఐల పోస్టుల కోసం పైరవీలు జోరందుకున్నాయి. గతంలో వైసీపీకి వీర విధేయులుగా ఉండి, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు రూటు మార్చారు. కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వెస్ట్‌జోన్‌లో వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ కాసులు కురిపించే స్టేషన్లుగా మారాయి.
- వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దుర్గమ్మ ఆలయం ఉంది. అమ్మవారిని దర్శించుకోవడానికి నిత్యం ప్రముఖులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో చాలామంది వన్‌టౌన్‌కు రావడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వన్‌టౌన్ వ్యాపార కేంద్రంగా కూడా ఉండటంతో పోటీ తీవ్రంగానే ఉంది.
- భవానీపురం పోలీసు స్టేషన్ జాతీయ రహదారికి అనుబంధంగా ఉంది. ఇక్కడ భూమి రేట్లు పెరగడంతో పాటు భూ లావాదేవీలు, వివాదాలు ఈ స్టేషన్‌కే ఎక్కువగా చేరుతుంటాయి. ఇక్కడే హోల్‌సేల్ ఐరన్ మార్కెట్, సరుకుల మార్కెట్ ఉన్నాయి. నిత్యం లోడింగ్, అన్ లోడింగ్‌లు అధికంగా జరుగుతాయి.
- ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో కూడా జాతీయ రహదారి ఉంది. ఇక్కడ పరిశ్రమలు, ఆయిల్ కంపెనీలు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు పీఎస్‌లకు పోటీ ఎక్కువగా ఉంది.
- గతంలో గన్నవరం మాజీ ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడిచి నాటి టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడిన గన్నవరం ఎస్ఐ వివాదాస్పదుడిగా పేరొందారు. గన్నవరం పరిసర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువచేసే మామిడి తోటలను బినామీ పేర్లతో కొన్నాడు. సీఐగా పదోన్నతి రావడంతో నగరంలో పలు స్టేషన్లలో పనిచేశాడు. ఇబ్రహీంపట్నంలో పనిచేసినప్పుడు ఆయనపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. బీఆర్‌టీఎస్ రోడ్డులో సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నప్పుడు పలు వాహనాలను ఆయన ఢీకొన్నాడు. ఈ వ్యవహారాన్ని బయటకు రానివ్వలేదు. ప్రస్తుతం కమిషనరేట్‌లో ఉన్న ఈయన ప్రధానమైన పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నాడు.
- కొత్తపేట పోలీసుస్టేషన్‌లో గతంలో పనిచేసిన ఓ సీఐ హోంగార్డులతో మసాజ్ చేయించుకుని వివాదాస్పదుడిగా మారాడు. అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఇంటికి రోజూ వెళ్లి, ఆ తర్వాతే స్టేషన్‌కు వచ్చేవాడు. కరోనా సమయంలో వ్యాపారులను బెదిరించి భారీగా డబ్బు వసూలు చేసి స్వామిభక్తిని చాటుకున్నాడు. ఇతని అవినీతి అక్రమాలపై నాటి సీపీ విచారణకు కూడా ఆదేశించారు. ఇలాంటి వారంతా ఇప్పుడు కూటమి నాయకులు చుట్టూ పోస్టింగ్‌ల కోసం తిరుగుతున్నారు.

మళ్లీ ‘కృష్ణా’వైపే..

- జోగి రమేశ్ మంత్రిగా ఉన్నప్పుడు మైనారిటీ వర్గానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్‌ను మచిలీపట్నం రూరల్ సీఐగా పోస్టింగ్ వేయించుకున్నారు. జోగి రమేశ్ నియోజకవర్గం మారాక ఆయనతో పాటు ఆ ఇన్‌స్పెక్టర్ కూడా మారిపోయారు. ఇప్పుడు ఆయన తిరిగి రూరల్ పీఎస్‌కు రావాలని ఆరాటపడుతున్నారు. ఈయనకు ముందు జోగి సామాజికవర్గానికి చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ రూరల్ పీఎస్‌కు ఎస్‌హెచ్‌వోగా ఉండేవారు. జోగి అండ ఉండటంతో ఆయన అక్రమాలకు అంతు లేకుండాపోయింది. ఆరోపణలు తీవ్రమవ్వడంతో ఆయన్ను అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు పంపారు. కొద్దిరోజుల్లో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు అనివార్యం కావడంతో ఆయన తిరిగి బందరులో అడుగుపెట్టడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.
- చల్లపల్లిలో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్ ఒక మహిళ విషయంలో దారుణంగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్నారు. ఆయన మనసు ఇప్పుడు బందరు వైపు మళ్లింది.
- గుడివాడ పట్టణంలో మూడు పీఎస్‌లు ఉన్నాయి. ఇది ఒక సర్కిల్ స్టేషన్‌గా ఉంది. వాటిలో రెండింటికి మాత్రం పోటీ తీవ్రంగా ఉంది. ఒకప్పుడు గుడివాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి, భారీగా వ్యవహారాలను చక్కబెట్టి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయన ఇప్పుడు గుడివాడను ఎంచుకున్నారు. శాంతిభద్రతల విభాగంలో ఏదో ఒక పీఎస్‌కు ఎస్‌హెచ్‌వోగా రావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. గుడివాడలో ఎస్ఐగా పనిచేసిన సమయంలో ఆయనపై భారీగా ఆరోపణలు వచ్చాయి. కొన్నాళ్ల క్రితం గుడివాడ ట్రాఫిక్‌లో ఎస్ఐగా పనిచేసి ఇన్‌స్పెక్టర్ హోదాలో ఉన్న ఓ అధికారి ఇప్పుడు మళ్లీ గుడివాడపై కన్నేశారు. ఇక్కడికి రావడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎస్ఐగా ఇంతకుముందు ముదినేపల్లిలో పనిచేసినప్పుడు ఏసీబీ ట్రాప్ నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. తర్వాత అక్కడి నుంచి గుడివాడలో వన్‌టౌన్, ట్రాఫిక్ ఎస్ఐగా వ్యవహరించారు. ఇప్పుడు ఆయన గుడివాడకు రావడానికి అన్ని మార్గాలు తిరుగుతున్నారు.



మచిలీపట్నం మండలం చిన్నాపురంలో పింఛను అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, తదితరులు

పింఛన్ల పంపిణీ 98.07 శాతం పూర్తి

మచిలీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం రాత్రికి 98.07 శాతం పూర్తయినట్టు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్ తెలిపారు. జిల్లాలో 2,40,939 మంది లబ్ధిదారులు ఉండగా 2,36,292 మందికి పింఛను అందించినట్టు తెలిపారు. మిగిలిన వారికి శుక్రవారం అందిస్తామన్నారు. మచిలీపట్నం మండలం చిన్నాపురం, నగరంలోని పలు ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మచిలీపట్నంలోని 6వ డివిజన్‌లో కలెక్టర్ డీకే బాలాజీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్ల రూపంలో రూ.102.16 కోట్ల నగదును అందిస్తున్నట్టు తెలిపారు.

దుర్గగుడి అభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి

» కేంద్రమంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి

6లో..

సొసైటీల్లో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

» జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి



దుర్గగుడి అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించండి

» కేంద్రమంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలోని అతి పెద్ద, ప్రాచీన దేవాలయం శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ. 100 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజ్ఞప్తి చేశారు. గురువారం, కేంద్ర మంత్రితో భేటీ అయినా ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల తరువాత అతి పెద్ద దేవస్థానంగా శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి ఆలయం ప్రసిద్ధి పొందిందని తెలిపారు. రోజుకి అమ్మవారిని 25,000 మంది భక్తులు దర్శించుకుంటారని, శుక్ర, శని, ఆదివారాలలో 50,000 మందికి పైగా భక్తులు తరలివస్తారని వివరించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాల ప్రతిపాదనల వివరాలను ఎంపీ వివరించారు. భక్తులకి అవసరమైన అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు, ఆలయ అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. తన అభ్యర్థనపై కేంద్రమంత్రి షెకావత్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కేశినేని తెలిపారు.

● అమృత్ పథకం కింద మచిలీపట్నానికి రూ.100.28 కోట్ల విలువైన 7 ప్రాజెక్టులు మంజూరు అయినట్లు కేంద్రం తెలిపింది. గురువారం, లోక్‌సభలో జనసేన ఎంపీ బాలశౌరీ అడిగిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి టోకన్ సాహు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 7 ప్రాజెక్టులలో 4 పూర్తయ్యాయని, మూడు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా గురువారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. కమిటీలో మొత్తం 15మంది సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు కేంద్రప్రభుత్వ ఖాతాలను పరిశీలిస్తారు.



జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో ఓంకాప్ జీఎం

గల్ఫ్ కార్మికులకు ముందస్తు అవగాహన కల్పించండి

» ఓంకాప్ జీఎం క్రాంతికుమారి

కృష్ణలంక, ఆగస్టు 1 : ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి ప్రయాణ జాగ్రత్తలు, ఉద్యోగ మెళకువలపై శిక్షణ ఇచ్చి గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా మాత్రమే అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ జనరల్ మేనేజర్ బీఆర్ క్రాంతికుమారి తెలిపారు. గల్ఫ్ వర్కర్లకు అందించాల్సిన శిక్షణపై ఐటీఐ కళాశాల ప్రాంగణంలో గల ఓంకాప్ కార్యాలయంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, కడప, చిత్తూరు, కాకినాడ, విజయవాడ జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విదేశాలలో ఉపాధి కోసం సరైన ధృవపత్రాలతో ప్రభుత్వ అనుమతితో నడపబడే ఏజెన్సీల ద్వారా మాత్రమే వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. సరైన వివరాలతో కనీసం 6 నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టు వర్క్ వీసా తప్పనిసరిగా వుండాలన్నారు. ఉపాధి పొందిన వారికి లైంగిక వేధింపులు, హింస, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు భారతీయ రాయబార కార్యాలయాన్ని సంప్రదించాల్సిన విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఓంకాప్ జిల్లా ఉపాధి కల్పన అధికారులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓంకాప్ హెచ్‌ఆర్ మేనేజర్ ఎం.సతీష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జి.గోపి, విశాఖపట్నం, శ్రీకాకుళం, కడప, కాకినాడ, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూముల క్రయ విక్రయాలపై నిషేధం ఎత్తేయండి

» చంద్రబాబుకు ఎమ్మెల్యే తాతయ్య వినతి



జగ్గయ్యపేట, ఆగస్టు 1 : దేవాదాయశాఖ ఇనాం భూముల క్రయవిక్రయాలపై నిషేధం ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బుధవారం సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో 1100 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల యజమానులు, ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్రయవిక్రయాలు నిలిచిపోవటం, బ్యాంకు రుణాలు రాకపోవటం, స్వాధీనంలో ఉన్న హక్కులు లేక కష్టాలు పడుతున్నారని వివరించారు. గతంలో ఈ భూములపై నిషేధం ఎత్తివేతకు తీసుకున్న చర్యలు తుది దశలో ఉన్నాయని తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

కోర్టుల పేర్లు మార్పు



విజయవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో న్యాయస్థానాల సముదాయంలోని క్రిమినల్ కోర్టుల పేర్లు మారాయి. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలతో ఈ పేర్లలో మార్పులు వచ్చాయి. కేంద్రం బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సన్హిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ నాగరిక సురక్షా సన్హిత), బీఎస్ఏ (భారతీయ సాక్ష్యా అధినియం) చట్టాలను అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ కేసులను విచారించే కోర్టుల పేర్లను మార్చారు. క్రిమినల్ కేసులను చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (సీఎంఎం), అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఏసీఎంఎం) కోర్టుల్లో విచారిస్తున్నారు. విజయవాడలో ఐదు సీఎంఎం కోర్టులు, తొమ్మిది మెట్రోపాలిటన్ కోర్టులు, ఆరు ఏసీఎంఎం కోర్టులున్నాయి. వాటిలో సీఎంఎం కోర్టులను చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం)గా మార్పు చేశారు. ఏసీఎంఎం కోర్టుల పేర్లను ఏసీజేఎంగా వ్యవహరిస్తున్నారు. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులుగా పిలుస్తున్నాయి. మార్చిన పేర్లతో త్వరలో ఆయా కోర్టుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని న్యాయాధికారులు నిర్ణయించారు.

ధానాపూర్-ఎస్ఎంబీటీ బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, ఆగస్టు 1 : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ధానాపూర్-బెంగుళూరు మధ్య ఈనెల 11వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నుస్రరత్ ఎం.మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 03247 నెంబరు రైలు ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రతి గురువారం, 03248 రైలు 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రతి శనివారం, 03241 రైలు 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, 03242 రైలు 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతి ఆదివారం రెండేసి ట్రిప్పుల చొప్పున నడుస్తాయన్నారు. 03245 రైలు 7వ తేది బుధవారం, 03246 రైలు ఈనెల 9వ తేదీ శుక్రవారం, 03259 రైలు 6వ తేదీ మంగళవారం, 03260 ఈనెల 8వ తేది గురువారం ఒక ట్రిప్పు చొప్పున నడుస్తాయన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డ్ అప్‌గ్రేడ్ చేసుకోండి

గుణదల, ఆగస్టు 1 : బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు సిమ్ కార్డ్‌ను తక్షణమే అప్‌గ్రేడ్ చేసుకుని 4జి సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. బిఎస్ఎన్ఎల్ దశలవారీగా పాన్ ఇండియా ఆధారంగా 4జి టెక్నాలజీని ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. అయినప్పటికీ చాలా మంది వినియోగదారులు ఇప్పటికీ తమ మొబైల్ సేవలను 2జి, 3జి సిమ్‌లో మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. కస్టమర్లకు వారి ప్రాంతాల్లో 4జి సేవలు ప్రారంభించినప్పుడు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సిమ్‌ను అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జి, 3జి, 4జి సేవలను ఆస్వాదించవచ్చని చెప్పారు. 4జికి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత 2జి, 3జి సేవలు కూడా కొనసాగుతాయని తెలిపారు. 54040కి సిమ్ అనే సందేశాన్ని పంపడం ద్వారా కస్టమర్లు తమ సిమ్ రకాన్ని సులభంగా కొనసాగించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ప్రవేశ పెట్టిన 4జి సిమ్ అప్‌గ్రేడ్ ఆఫర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తూర్పులో వృద్ధునికి పింఛను ఇస్తున్న కలెక్టర్ సృజన



షేర్ అహ్మద్ పేటలో శ్రీరాం తాతయ్య..



వీరభద్రపురంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్..



కోడూరులో పింఛను పంపిణీ చేస్తున్న బుద్ధప్రసాద్

ఆత్మీయ పలకరింపుతో..

ఎన్టీఆర్ భరోసా పంపిణీ

ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటరాగా.. సచివాలయ ఉద్యోగులు గురువారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. నిద్ర లేపి పింఛన్లు అందచేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 3.30 గంటలకు పింఛన్లు ఇవ్వడం గతంలో ఎన్నడూ లేదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

అర్హులైన పేదలందరికీ పింఛన్లు

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 : అర్హులైన పేదలు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం ఉదయం కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండిరామకృష్ణ, తదితరులతో కలిసి మంత్రి చిన్నాపురం, నారాయణపురంలలో పింఛన్లు పంపిణీ చేశారు. చిన్నాపురంలో మంచానికే పరిమితమైన దివ్యాంగుడు నాంచారయ్యకు రూ.15 వేలు అందజేశారు. చేనేత కార్మికుడు సుబ్బారావుకు రూ.4వేలు అందజేశారు. నారాయణపురం యానాదుల కాలనీలో ఏకశిరి చెంచమ్మకు వితంతు పింఛను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నాపురంలో చేనేత కార్మికునికి పింఛను అందజేస్తున్న మంత్రి రవీంద్ర

పింఛన్లు పంపిణీ చేసిన కృష్ణా కలెక్టర్

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులను కుశల ప్రశ్నలు వేస్తూ కలెక్టర్ చిలకలపూడిలోని 6వ డివిజన్‌లో విజయలక్ష్మికి పింఛను పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనరు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



16వ వార్డులో వృద్ధురాలికి పింఛను అందచేస్తున్న కలెక్టర్ బాలాజీ

పెడనలో 98 శాతం పూర్తి..

పెడన : పెడన మునిసిపాలిటీలో పింఛన్ల పంపిణీ విజయవంతమైంది. సచివాలయ ఉద్యోగులు గురువారం సాయంత్రం 5.30 గంటలకు 98 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 4477 మంది లబ్ధిదారులుండగా సాయంత్రానికి 4406 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ బాలాజీ గురువారం వార్డుల్లో పింఛన్ల పంపిణీ తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 16వ వార్డులో వృద్ధులకు పింఛన్లు అందజేసి కుశల ప్రశ్నలు వేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలిసి 7వ వార్డు వీరభద్రపురంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కమిషనర్ వెంకట్రామయ్య, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, టీడీపీ నాయకులు ఏడుకొండలు, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, తమ్మా భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో.. కలెక్టర్ సృజన

పటమట : లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాన్ని అందించే కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 13వ డివిజన్ కృష్ణానగర్ 57వ సచివాలయం పరిధిలో గురువారం లబ్ధిదారులను స్వయంగా కలిసి పింఛన్లు అందించారు. ముఖ్యమంత్రి తరపున క్షేమసమాచారాన్ని తెలుసుకొని వృద్ధాప్య పింఛన్ మొత్తం రూ.4 వేల చొప్పున, డయాలసిస్ చేయించుకుంటున్న నాగవరపు బాలాజీకి రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 2,34,143 మంది పింఛన్‌దారులకు సుమారు రూ.99 కోట్ల మేర అందజేసే కార్యక్రమాన్ని విజయవంతమైనట్టు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మ్యాప్ చేసిన లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందించినట్టు పేర్కొన్నారు.

పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి : ఎమ్మెల్యే గద్దె

పేదలు ఇబ్బంది పడకూడదనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నట్టు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని వారిపై చిత్తశుద్ధితో ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. కొత్తగా అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకొంటున్నామని, గతంలో వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన వారి జాబితాను సమీక్షించి వారికి కూడా లబ్ధి చేకూర్చనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ ఎం.ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆసుపత్రి బెడ్ వద్దకే.. పింఛన్

పెనమలూరు : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా కూటమి శ్రేణులు లబ్ధిదారులను వెతికి మరీ వారి చేతికి నేరుగా పింఛన్ సొమ్మును అందజేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. పెదపులిపాక గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ అనారోగ్యంతో నిమ్రా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్‌లో ప్రత్యేక చికిత్స తీసుకొంటోంది. ఆమె వద్దకు గ్రామ టీడీపీ నేతలు సచివాలయ సిబ్బంది ప్రసాద్‌ను దాదాపు ముప్పై కిలోమీటర్లు తీసుకెళ్లి ఆమె చేతికి పింఛను అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబురావు తదితరులు ఉన్నారు.



ఆసుపత్రి బెడ్ మీదే పింఛన్ అందిస్తున్న పెదపులిపాక టీడీపీ నాయకులు

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 1 : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్ తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు. వేడుకల నిర్వహణకు సంబంధించి శాఖలపరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ మార్గనిర్దేశనం చేశారు. అదే రోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరగనున్న ఎట్‌హోం కార్యక్రమానికి సంబంధించి కూడా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శన, ముఖ్యమైన భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరణ, వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ బందోబస్తు తదితరాలపై సీఎస్ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు.



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని

కృష్ణలంక : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య ప్రదాయిని అని, బిడ్డకు తల్లిపాలను మించిన శ్రేయస్కరం మరొకటి లేదని కలెక్టర్ జి.సృజన అన్నారు. గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) ప్రారంభమైన సందర్భంగా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ, తల్లిపాల వారోత్సవాల ఔన్నత్యాన్ని తెలియజేయడం, అపోహలను తొలగించడం, క్షేత్రస్థాయిలో ఎఎన్ఎంలు, ఆశాలు ప్రత్యేక సెషన్లతో అవగాహన కార్యక్రమాలు, 2కే ర్యాలీలు, గృహ సందర్శనలు వంటివి ఈ వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయన్నారు. తల్లి శారీరక, మానసిక స్థితిని అర్థం చేసుకొని భర్త, కుటుంబసభ్యులు ఆమెకు తోడుగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 : ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. గురువారం గిలకలదిండిలోని ఫిషింగ్ హార్బరును కలెక్టర్ సందర్శించి నిర్వహిస్తున్న పనుల వివరాలను అడిగితెలుసుకున్నారు.రూ 422 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఫిషింగ్ హార్బరు పనుల్లో 50 శాతం పూర్తయినట్టు ఎపి మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి ఏ చంద్రశేఖర్, ఈఈ మునిరెడ్డి, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల వార్షిక సమావేశం రేపు

బస్ స్టేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రజారవాణా సంస్థ ఉద్యోగుల వార్షిక సమావేశం ఈనెల 3వ తేదీన భవానీపురంలోని శక్తిగ్రాండ్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.కేదారేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైన ఉద్యోగుల సమస్యల పైన చర్చ జరుగుతుందని, దీంతో పాటు నూతన కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు.

ఏసీఏ సీనియర్ క్రికెట్‌లో పట్టుబిగించిన కృష్ణా

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 1 : ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు వేదికగా గురువారం ప్రారంభమైన సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో తొలి రోజే కృష్ణా టీమ్ ప్రత్యర్థి ప్రకాశంపై పట్టు బిగించింది. మొదటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ప్రకాశం ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 384/4 పరుగులు చేసింది. సందీప్ చెలరేగి 200 బంతుల్లో 23 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 167 పరుగులతో అజేయంగా నిలిచాడు. ప్రణీత్ 72 పరుగులతో క్రీజులో ఉన్నాడు. విశాల్ అర్ధసెంచరీ(64) వద్ద అవుటయ్యాడు. ప్రకాశం బౌలర్ వి.వేణు 69 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

సొసైటీల్లో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

» జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి



చల్లపల్లి, ఆగస్టు 1 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు/సొసైటీ)లో ఎన్నికల కోసం ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకోవాల్సిందిగా సొసైటీ సీఈవోలకు ఆదేశాలిచ్చినట్లు జిల్లా సహకారశాఖ అధికారి(డీసీవో) కె.చంద్రశేఖర రెడ్డి తెలిపారు. చల్లపల్లి సొసైటీలో ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలనకు వచ్చిన ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, సొసైటీల కాలపరిమితి ఈ ఏడాది డిసెంబరులో ముగియనుందన్నారు. కృష్ణాజిల్లాలో 213 సొసైటీలకు పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరగాల్సి ఉందనీ, ఈమేరకు సొసైటీల్లో ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించినట్టు చెప్పారు. సొసైటీల్లో ఓటర్ల జాబితాలను సిద్ధంచేసి సెప్టెంబరులో జరిగే సర్వసభ్య సమావేశాల్లో ప్రచురించాలని తెలియచేశామన్నారు. ఈ విషయమై సీఈవోలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు.

ఓటు హక్కుకు అర్హతలివే

సొసైటీ పాలకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండాలంటే సంఘ పరిధిలో వ్యవసాయ భూమి కలిగి రూ.300 వాటా ధనముగా చెల్లించి ఉండాలి. భూమి లేకుండా సంఘంలో ఉన్న సహ సభ్యుడు ఎన్నికల ప్రకటన తేదీకి ముందు 12 నెలలకు పైబడి నిరంతర కాలవ్యవధి గల కనీస డిపాజిట్టు రూ.10వేలు కలిగి ఉండాలి. ఎన్నికల ప్రకటన తేదీకి 30 రోజుల ముందు సంఘ వ్యాపారము చేయు సభ్యుడై ఉండాలి. డిపాజిట్లు, అడ్వాన్సులు కాకుండా ఎన్నికల ప్రకటన తేదీకి ముందు 12 నెలల కాల వ్యవధిలో రూ.10వేల కనీస వ్యాపారం నిర్వహించిన నాన్ లోన్ మెంబరు పూర్తి ఓటింగ్ హక్కు కలిగి ఉంటారు. నగదు లేదా వస్తురూపేణా సంఘానికి చెల్లించాల్సి ఉండి మూడు నెలలకు పైగా చెల్లించకుండా అపరాధిగా ఉండరాదు. సహ సభ్యునిగా ఉన్న ప్రతి గ్రూపు రుణగ్రహీత లేదా గ్రూపు డిపాజిటరు ఆ గ్రూపుచే నామినేట్ చేయబడిన ప్రతినిధి ద్వారా ఓటు వేయుటకు హక్కు ఉండదు. రెండేళ్లలో జరిగే సర్వసభ్య సమావేశాలకు ముందస్తు అనుమతి లేకుండా కనీసం రెండు సమావేశాలకు గైర్హాజరైతే సభ్యునిగా కొనసాగేందుకు అనర్హులు.

ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

సొసైటీ సభ్యులు వారి ఈ కేవైసీ వివరాలు(ఆధార్, పాన్, పాస్‌పుస్తకాలు, ఫొటోలు) సంఘంలో ఇచ్చి ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అలా చేసుకోని వారు ఓటు హక్కును కోల్పోతారని డీసీవో వివరించారు. సొసైటీల సీఈవోలు తమ సొసైటీలో అర్హత కలిగిన, అనర్హత కలిగిన ఓటర్ల జాబితాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి తయారు చేసి సర్వసభ్య సమావేశంలో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో తోట కృష్ణారావు ఉన్నారు.

ప్రత్యేక కౌంటర్లలో నాణ్యమైన సరుకులు : జేసీ

కృష్ణలంక, ఆగస్టు 1 : పౌరసరఫరాలశాఖ మంత్రి ఆదేశాలను అనుసరించి జిల్లాలో రైతుబజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో సరసమైన ధరల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో వున్నట్టు జేసీ నిధి మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ తదితర పెద్ద రిటైల్ దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు పొందవచ్చన్నారు. కిలో కందిపప్పు (దేశవాళి) రూ.150, కిలో బియ్యం (స్టీమ్డ్-బీపీటీ/సోనామసూరి) రూ.48, పచ్చిబీపీటీ/సోనామసూరి రూ.47కే అందజేయనున్నట్టు వివరించారు. కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్ మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడి

» నిందితుడి అరెస్టు, రిమాండ్



బంటుమిల్లి, ఆగస్టు 1 : మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బంటుమిల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన బంటుమిల్లి రాజీవ్‌గాంధీ మార్కెట్‌లో మతిస్థిమితం లేని మహిళ(43) తమ్ముడు, మరదలితో కలిసి నివాసం ఉంటోంది. గత నెల 26వ తేదీన తమ్ముడు, అతడి భార్య పనుల నిమిత్తం బయటికి వెళ్లగా పక్కనే నివాసం ఉంటున్న కొనాల వెంకటేశ్వరరావు లైంగికదాడి చేశాడు. సాయంత్రం తమ్ముడు, మరదలు ఇంటికి వచ్చేసరికి తీవ్ర రక్తస్రావంతో మహిళ బాధపడుతుండగా వైద్యం నిమిత్తం మచిలీపట్నం తరలించారు. కోలుకున్న అనంతరం 29వ తేదీన ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం కొనాల వెంకటేశ్వరరావు మతిస్థిమితం లేని మహిళను చూసి సైగ చేస్తుండడాన్ని మరదలు గమనించింది. అనుమానంతో గ్రామ పెద్దల ద్వారా వెంకటేశ్వరరావును ప్రశ్నించగా లైంగికదాడి చేసినట్టు ఒప్పుకోవడంతో బంటుమిల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తూ గురువారం వెంకటేశ్వరరావును అరెస్టు చేసి బంటుమిల్లి కోర్టులో హాజరు పరచి రిమాండ్ నిమిత్తం బందరు సబ్ జైలుకు తరలించారు.

ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా లోకేశ్వరి

వన్‌టౌన్ ఆగస్టు 1 : ఎన్టీఆర్ జిల్లా దేవాదాయ శాఖ ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా అంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానం ఈ.ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న లోకేశ్వరిని నియమించారు. ఈ మేరకు గురువారం సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీతారావమ్మ వ్యక్తిగత పనుల పై 3 నెలల పాటు సెలవు పై వెళ్లారు. దీంతో సంబంధిత అధికారులు లోకేశ్వరిని ఇంఛార్జి సహాయ కమీషనర్‌గా నియమించారు. ఆమె రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

బాపులపాడు తహసీల్దార్‌గా నాగభూషణం బాధ్యతల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 1: బాపులపాడు తహసీల్దార్‌గా వి.నాగభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా నాగభూషణాన్ని బాపులపాడు మండలానికి కేటాయించారు. బాపులపాడులో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, వీర్వోలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



తహసీల్దార్ నాగభూషణానికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

బియ్యం, కందిపప్పు ధర తగ్గింపు

ఉయ్యూరు, ఆగస్టు 1: ఉయ్యూరు, కంకిపాడు, పామర్రు రైతుబజార్లు, రిలయన్స్ స్మార్ట్, ఉషోదయ, మోర్, రత్నదీప్, బిగ్‌బైన్ రిటైల్ మాల్స్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రభుత్వం వినియోగదారులకు విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు ధర ఈనెల 1 నుంచి తగ్గించినట్టు ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టీమ్డ్ బియ్యం కేజీ రూ.49 నుంచి రూ.48, ముడిబియ్యం రూ.48 నుంచి రూ.47కు కందిపప్పును కేజీ రూ.160 నుంచి రూ.150కు తగ్గించి విక్రయిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

67.83 క్వింటాళ్ల బియ్యం విక్రయం

గన్నవరం: రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ద్వారా ఇప్పటి వరకూ స్టీమ్డ్ బియ్యం 67.83 క్వింటాళ్లు, కందిపప్పు 24.45క్వింటాళ్లు విక్రయాలు జరిగాయని తహసీల్దార్ ఎస్ఎస్ పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందిపప్పు కేజీ రూ.150, బియ్యం బీపీటీ, సోనామసూరి రకం రూ.48, పచ్చిబియ్యం రూ.47 చొప్పున విక్రయిస్తున్నారని, అదే ధరలకు ఉషోదయ సూపర్ మార్కెట్‌లోనూ బియ్యం, కందిపప్పు ఇస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కేరళ వరద బాధితుల కోసం

విరాళాల సేకరణ

గన్నవరం, ఆగస్టు 1: కేరళలోని వాయనాడు వరద బాధితులను ఆదుకోవాలంటూ గురువారం గన్నవరంలో సీపీఎం నాయకులు విరాళాలను సేకరించారు. రూ.15,980 సేకరించామని నాయకులు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కళ్లం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి, మిరప నాగేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, సాంబశివరావు, గుండెమెడ ఉదయభాస్కర్, బాబావలి, ఏసుదాసు పాల్గొన్నారు.

పింఛన్ నగదు పెంపుపై

మాట నిలబెట్టుకున్నాం

- మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం త్వరలో అమలు చేస్తాం: ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న కూటమి నాయకులు

ఉయ్యూరు, ఆగస్టు 1: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను టీడీపీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, పింఛన్ నగదును ఇచ్చిన హామీ ప్రకారం పెంచి మాట నిలబెట్టుకుందని, లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే ఒకటో తారీఖున ఉదయానే సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయిస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంట ఎస్సీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకాలను టీడీపీ కూటమి ప్రభుత్వం త్వరలో అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉపసర్పంచ్ దండమూడి రాంబాబు, టీడీపీ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుండె రాంబాబు, కొండా్రపవీణ్, జనసేన నాయకుడు ముప్పా రాజా పాల్గొన్నారు. ఉయ్యూరు 5, 10 వార్డుల్లో పింఛన్ల పంపిణీని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుని పింఛన్లు పెంచి ఒక్కరోజులోనే వంద శాతం పంపిణీ చేయడం చంద్రబాబు పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమన్నారు.

పెనమలూరు: పోరంకి సర్కిల్‌లోని బీజేఆర్ నగర్‌లో పింఛన్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణ చేశారు. అనుమోలు ప్రభాకరరావు, ముప్పా రాజా, ద్రోణవల్లి సుబ్బారావు బొంగరాల అబ్రహం పాల్గొన్నారు. కానూరు సనత్‌నగర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పాల్గొన్నారు. పెనమలూరు చెంచుల కాలనీలో టీడీపీ నాయకుడు మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. చిగురుపాటి శ్రీనివాసరావు, తోటకూర ఉదయభాస్కర్, కంచర్ల శ్రీనివాసరావు, మోర్ల నరేంద్ర, యలమంచిలి ప్రసాద్, గూడవల్లి పూర్ణ, పాములు బలరాం పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉయ్యూరు సుందరమ్మపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

ఈడుపుగల్లులో..

కంకిపాడు: నియోజకవర్గంలో 90 శాతం పింఛన్లు గురువారం పంపిణీ చేశామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. ఈడుపుగల్లులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. వలంటీర్ల వ్యవస్థతో పని లేకుండా నియోజకవర్గంలో 90 శాతం మందికి పింఛన్ పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, షేక్ షకార్, షేక్ మాబు సుబాని, పుటగుంట రవి, కిలారు శ్రీను, సుంకర శ్రీహరి, అనుమోలు రామకృష్ణ, మైనేని దుర్గాభవాని, షేక్‌నాగుర్ బి.బాజి బి.బండారుప్రవీణ్ పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో పింఛన్ల పంపిణీలో వీరంకి పావనమూర్తి, ఈడా కోటేశ్వరరావు పాల్గొన్నారు. కంకిపాడులో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, గోగినేని వెంకట రమణ, బొర్రా వెంకట్, బోయిన నాగరాజు, సుంకర సురేష్, కుంటా గంగాధర్, పిచుక రవి పాల్గొన్నారు.

విజయవాడ రూరల్: అంబాపురంలో పింఛన్ల పంపిణీలో అధికారులతో పాటు టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. గ్రామంలో 555 పింఛన్లను ఒకటో తేదీనే పంపిణీ చేశామని తెలిపారు.

బాపులపాడు మండలంలో 98 శాతం పంపిణీ

హనుమాన్‌జంక్షన్: మండలంలో అన్ని రకాల పింఛన్లు 11,985 ఉండగా మొదటి రోజే 98 శాతం పంపిణీ చేసినట్లు బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. గ్రామంలో పింఛన్ల పంపిణీలో తెలుగుమహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, టీడీపీ జంక్షన్ పట్టణాధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బాపులపాడులో వృద్ధురాలికి పింఛను నగదు అందజేస్తున్న సాయికల్యాణి, శ్రీనివాసరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వేలేరు, వీరవల్లి, కొయ్యూరు, ఉమామహేశ్వరపురం, కొడూరుపాడు, రంగన్నగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు లంక సురేంద్ర మోహనబెనర్జీ, సత్యనారాయణప్రసాద్, గుండపనేని ఉమావరప్రసాద్, పిల్లా అనిత, లంక అజయ్‌కుమార్, అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, కాజ సురేష్, వేములపల్లి శ్రీనివాసరావు, అంగడాల సీతారామస్వామి, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ సాంబశివరావు, శ్రీకాకులపు భరత్, రవీంద్ర, కొల్లి వీరవెంకట సత్యనారాయణ, కాంద్రు అజయ్‌కుమార్, తూమాటి సాంబశివరావు తదితరులు ఆయాగ్రామాల్లో పాల్గొన్నారు. వీరవల్లి కాలనీలో నడవలేని మహిళ ఇంటికి వెళ్లి వీఆర్వో కేశవ పింఛన్ అందజేశారు.

గన్నవరం మండలంలో 99శాతం

గన్నవరం: మండలంలోని 21 గ్రామపంచాయితీల్లో సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు 99శాతం పింఛన్లను లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి అందజేశారని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. 11,266 పింఛన్లకు గాను 11,139 మందికి రూ.4.69 కోట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.



కేవీ రమణకు శుభాకాంక్షలు చెబుతున్న కేవీఆర్ కిషోర్



కేవీ రమణకు కేక్ తినిపిస్తున్న పొట్లూరి బసవరావు, జాస్తి వెంకటేశ్వరరావు

ఘనంగా కేవీ రమణ జన్మదినోత్సవం

- భారీ గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు
- అనాథ, దివ్యాంగుల ఆశ్రమాలకు బియ్యం, నిత్యావసరాలు, పండ్లు అందజేత

గన్నవరం, ఆగస్టు 1: ప్రముఖ న్యాయవాది కలపాల వెంకట రమణ జన్మదినోత్సవాన్ని గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేవీ రమణ పుట్టినరోజు సందర్భంగా పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేయటం అభినందనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. ఏటా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేవీ రమణ తనవంతు సాయమందిస్తూ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అనాథ పిల్లల ఆశ్రమానికి, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, పుస్తకాలు, బస్ పాస్‌లు పంపిణీ చేశారని అన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి అనేక ఆర్థిక సహాయాలు చేశారని పేర్కొన్నారు. ఆయన స్వగృహంలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కేవీ రమణ కట్‌చేశారు. భారీ గజమాలతో అభిమానులు కేవీ రమణను సత్కరించారు. ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బీకేఆర్ అమ్మ అనాథల ఆశ్రమానికి, స్పందన మానసిక వికాస కేంద్రానికి, పొట్టిపాడు, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, కేసరపల్లి గ్రామాల్లోని ఆశ్రమాలకు బియ్యం, సరుకులు, పండ్లు అందజేశారు. మన్న మినిస్ట్రీస్‌లోని విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కేవీ రమణ జన్మదిన కార్యక్రమాల్లో కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, మూల్పూరు ధనకోటేశ్వరరావు, మూల్పూరు శివరామకృష్ణ, నిడమర్తి బుజ్జారావు, రెడ్డి రామకృష్ణ, కడియాల హనుమంతురావు, సీహెచ్ చందు, జి.రూప్ కుమార్, అలీ, నళిని, భగవాన్, కొండేటి కొండలరావు, మరీదు శ్రీధర్, వి.గురునాథరావు, నాగనబోయిన గిరీష్‌రావు, తుమ్మల లక్ష్మణరావు, ప్రత్తిపాటి శ్రీను, తుమ్మల చిన్న, షేక్ హాజీబాషా, ఎస్‌బీఐ మేనేజర్ వెంపాటి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలోని అనాథాశ్రమంలో ఏలూరి సుధీర్ వంద మందికి అన్నదానం చేశారు.

తల్లిపాలు అమృతతుల్యం

ఉంగుటూరు, ఆగస్టు 1: తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్, పెదఅవుటపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను గురువారం పెదఅవుటపల్లి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. తల్లిపాల ప్రయోజనాలపై గర్భవతులు, బాలింతలు, తల్లులకు పద్మాదేవి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా మొహినుద్దీన్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ పి.శాస్త్రి, ఎంపీహెచ్‌ఈవో జీవకాంత్‌రాజు, హెచ్ఎస్ రోజ్‌లీన్ పాల్గొన్నారు. దోసపాడు గ్రామానికి చెందిన దాతలు మరింగంటి సీతారామాచార్యులు, పద్మావతి దంపతులు గ్రామంలోని 9 అంగన్వాడీ కేంద్రాలకు రూ.16 వేలు విలువైన 10సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. వీటిని దాత బంధువు ఆలూరు సత్యనారాయణ అంగన్వాడీ కార్యకర్తలకు అందజేశారు.

కంకిపాడు: కంకిపాడు- 4 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ఉయ్యూరు: ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 210 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం పంపిన బ్యాగులు, పుస్తకాలను ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డి.విజయశ్రీ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కాకాని శ్రీనివాసరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, పొట్లూరి మురళి, తాతబ్బాయి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వీరవల్లి జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ చదువుకుంటున్న 23మంది విద్యార్థులకు పుస్తకాల కిట్లను పంపిణీ చేసినట్లు హెచ్ఎం నిర్మల వివరించారు. ఆళ్ల కృష్ణారావు, ఎం.రమణ గోపాల్, సునీల్‌కుమార్, గోవర్ధన్, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



బిళ్లనపల్లిలో ఫీవర్‌సర్వే రిపోర్టులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 1: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో గీతాబాయి సూచించారు. బిళ్లనపల్లిలో అనారోగ్య కారణాలతో వ్యక్తి మృతి చెందడంతో వైద్యాధికారి మంజూష జిల్లా మలేరియా అధికారి బి.రామారావుతో కలిసి బుధవారం రాత్రి గ్రామంలో ఆమె పర్యటించారు. మృతుడు తాతా దుర్గారమేష్(28) విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెదడువాపుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలపగా మెడికల్ రిపోర్టులను ఆమె పరిశీలించారు. వాటర్‌ట్యాంకు క్లోరినేషన్, వాటర్ పైపులైన్లలో లీకేజీ, డ్రెయినేజీ వ్యవస్థపై సర్పంచ్ వెలివెల రామకృష్ణ, కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ, ఇతరశాఖలతో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య పనులు చేయాలన్నారు. ఇంటింటి ఫీవర్‌సర్వే క్రమం తప్పకుండా చేయాలని ఆదేశించారు. వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చేసిన లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించిన రిపోర్టులను పరిశీలించారు. ఎవరైనా దగ్గు, జ్వరంతో బాధపడుతుంటే డెంగ్యూ మలేరియా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి రామారావు సూచించారు. సీహెచ్‌వో ఫణికుమార్, సబ్ యూనిట్ అధికారి వెంకటరాజు, సూపర్‌వైజర్ అప్పారావు, జి.నాగరాజు, శ్రీదేవి, మల్లిక పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు, ఆగస్టు 1: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై టీడీపీ కూటమి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో స్పందించాలని, సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కనీస వేతనం అమలుచేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల నాయకులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం ఆయన మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందులు పడుతూ విద్యార్థుల కడుపులు నింపుతున్న వంట ఏజెన్సీలకు ఉద్యోగభద్రత కల్పించాలని, ఇటీవల ప్రభుత్వం మెనూలో చేసిన మార్పులకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలని కోరారు. పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని, వంటపాత్రలు, రెండుజతల యూనిఫాంలు(కాటన్‌చీరలు)ఇవ్వాలని, అవసరమైన చోట్ల వంటషెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల్లో వంటకార్మికులపై నేతలు సాగిస్తున్న రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులను నిలువరించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షురాలు సీహెచ్ లక్ష్మి, ఉపాధ్యక్షురాలు షేక్ మహబూబీ, సంఘసభ్యురాలు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది శ్రీరాం, శారద తదితరులు పాల్గొన్నారు.



నున్నలో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



ముస్తాబాదలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కంకిపాడులో మోదీ, చంద్రబాబు, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మాదిగల్లో ఆనందోత్సాహాలు

వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

విజయవాడ రూరల్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమంతోనే వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా నేత మంద వేణు అన్నారు. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నున్న గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అనివార్యమని వేణు అన్నారు. ఈ విజయాన్ని మాదిగ అమర వీరులకు అంకితమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు వినోద్, కోటేశ్వరరావు, దేవదాసు పాల్గొన్నారు.

దశాబ్దాల కల వర్గీకరణ

కంకిపాడు: మాదిగల దశాబ్దాల కల వర్గీకరణ అని అది సుప్రీం కోర్టు తీర్పుతో అది నెరవేరబోతోందని ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దొప్పలపూడి నాగేశ్వరరావు అన్నారు. టీడీపీ మండల కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలని మంద కృష్ణమాదిగ చేసిన ఉద్యమాల ఫలితంతోనే వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం చంద్రబాబు ముందు నుంచి అనుకూలమేన్నారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, సురేష్, లాం ఇజ్రాయిల్, దొప్పలపూడి కల్యాణి, మరియమ్మ, వీరమ్మ, పద్మ, జనసేన మండల కార్యదర్శి దొప్పలపూడి రంజిత్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

గన్నవరం: ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్ల అలుపెరగని పోరాటం చేసిన మాదిగలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సంతోషదాయకమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చోడవరపు వెంకటేశ్వరరావు అన్నారు. ముస్తాబాదలో గురువారం బాబూజగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాదిగల పోరాటం ఫలించిందని వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు హర్షణీయమన్నారు. ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయసమ్మతమైన తీర్పు

హనుమాన్‌జంక్షన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు న్యాయ సమ్మతమైన తీర్పు ఇచ్చిందని ఎమార్పీఎస్ గన్నవరం ఇన్‌చార్జి ముదునూరి కొండలరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు తీర్పుననుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు సహకరించాలని ఆయన కోరారు.

మాదిగలను ఓటు బ్యాంకుగా చూసిన వైసీపీ

- మాదిగల అభ్యున్నతి టీడీపీతోనే
- సుప్రీం తీర్పుతో సామాజిక న్యాయం జరిగినట్టే: తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మాదిగలను వైసీపీ ఓటు బ్యాంకుగా చూసిందని, వర్గీకరణ కోసం దశాబ్దాలుగా ఎదురుచూసిన మాదిగలకు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా సామాజిక న్యాయం జరిగిందని, మాదిగల అభ్యున్నతి, సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్ అన్నారు. బొమ్ములూరులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. మాదిగల 30ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి దక్కిన ఫలితమిదన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ నాయకులు కొందరు తయారవుతున్నారన్నారు. పచ్చిగళ్ల శ్రీనివాసరావు, గాలంకి వినయ్ కుమార్, దాసరి నాగరాజు, రాజేష్, కోలంటి ధనుంజయరావు, కుందేటి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	96, 105, 116
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

స్నేహపూర్వక పోలీసింగ్‌కు కృషి : ఎస్పీ



మచిలీపట్నం టౌన్ : స్నేహ పూర్వక పోలీసింగ్‌కు కృషి చేస్తామని ఎస్పీ గంగాధరరావు అన్నారు. బందరు తాలూకా, ఆర్‌పేట పోలీసు స్టేషన్లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా మచిలీపట్నంలోని పోలీసు స్టేషన్లను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా డ్రెయిన్లు అభివృద్ధి చేయాలి

● ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 1 : రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా డ్రైనేజీలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. బందలాయిచెరువు మైనర్ డ్రైనేజీని గురువారం ఆయన పరిశీలించారు. బందలాయి చెరువు, అశ్వారావుపాలెం, పోటుమీద గ్రామాల పరిధిలోని పొలాల ముురుగు నీటిని రత్నకోడు మేజర్ డ్రైనేజీలోకి మళ్లించే బందలాయి చెరువు మైనర్ డ్రైనేజీని ఆరు కిలోమీటర్లు పొడవునా అభివృద్ధి చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని డ్రైనేజీ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు వివరించారు. రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలిగేలా పనులు నిర్వహిస్తున్నట్లు డీఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

అవినీతిపై ప్రశ్నించినందుకే వైసీపీ కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు

● జనసేన కౌన్సిలర్ శివపావని

పెడన : అవినీతిపై ప్రశ్నిస్తున్నాననన్న అక్కసుతో వైసీపీ కౌన్సిలర్ కటకం ప్రసాద్ కౌన్సిల్ సమావేశంలో తనను మెంటల్ అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశాడని 12వ వార్డు జనసేన కౌన్సిలర్ మట్టా శివపావని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై తన వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయన్నారు. జనసేన పార్టీ సీనియర్‌నాయకుడు కోట నాగరాజు మాట్లాడుతూ, శివపావనిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కటకం ప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలిగట్ల ప్రసాద్, నాని, కార్తీక్, శివశంకర్, సుబ్రహ్మణ్యం, నాగమల్లేశ్వరరావు, భార్గవ్ పాల్గొన్నారు.



కిడ్నీ బాధితురాలికి పెన్షన్ అందజేస్తున్న మండలి



పామర్రులో వృద్ధురాలి కాళ్లు కడిగి పెన్షన్ అందజేస్తున్న కుమార్‌రాజా



నాగేశ్వరరావుపేటలో పెన్షన్ అందజేస్తున్న కాగిత కృష్ణప్రసాద్



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

పేదరికం లేని సమాజమే లక్ష్యం

● ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్ ఉద్ఘాటన ● పండగలా పెన్షన్ల పంపిణీ

కోడూరు, ఆగస్టు 1 : పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం కోడూరులో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచంలో ఉన్న దివ్యాంగురాలు వేమూరి కృష్ణకుమారి, గొర్ల అమ్మారావు, యార్లగడ్డ శేషగిరిరావు, భీమవరపు విలియం, పెద్ది చరాబంధి రాజుల ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకుని రూ.15 వేల పింఛన్ నేరుగా అందజేశారు. ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు, ఎంఈవో రామదాసు, శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు వర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్:** వేకనూరులో 71 మందికి 71 పింఛన్ అందజేసినట్లు అశ్వారావుపాలెం గ్రామ సచివాలయ కార్యదర్శి డి.పద్మావతి అందజేశారు. **నాగాయలంక :** సొర్లగొందిలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ డయాలసిస్ పేషంట్ కొప్పనాతి లక్ష్మికి పింఛన్ అందజేశారు. **పామర్రు :** వృద్ధురాలి కాళ్లు కడిగి పాదాభి వందనం చేసి ఎమ్మెల్యే కుమార్ రాజా సామాజిక పింఛన్ పంపిణీ చేశారు. తొలిరోజు 98.42 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో భారతి తెలిపారు. **కూచిపూడి :** అయ్యంకిలో పింఛన్ల పంపిణీలో కుమార్ రాజాతో పాటు కూటమి నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, తాతా వీర దుర్గా ప్రసాద్, వీరంకి తులసీదాస్, పెద్ద మస్తానరావు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** బొడ్డపాడు, చినపులిపాక, తోట్లవల్లూరు గ్రామాల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొని పండుగలా పింఛన్లు పంపిణీ చేశారు. **గడ్డిపాడు (పమిడిముక్కల) :** గడ్డిపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే కుమార్‌రాజా ప్రారంభించారు. టీడీపీ నాయకులు లింగంనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** మండలంలో గురువారం నాడే 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామలింగేశ్వరరావు తెలిపారు. **మచిలీపట్నం టౌన్ :** సామాజిక పింఛన్లు రూ. 4 వేలకు పెంచడంతో పింఛనుదారుల ముఖంలో ఆనందం కనబడుతోందని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో గోపు సత్యనారాయణ పర్యటించి పండుగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేశారు. బొమ్మిడి ఏడుకొండలు, మహేష్, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, బొలిశెట్టి నాని, మోకా వెంకన్న, ఏడుకొండలు, వంకా కాశీ, ఇమ్మానుయేల్, బొమ్మిడి కొండలరావు, శ్రీరాములు, చక్కా రామారావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** మండలంలో పింఛన్ల పంపిణీ 98.41 శాతం పూర్తయింది. చల్లపల్లిలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, మండల టీడీపీ అధ్యక్షుడు..వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ పైడిపాముల సభ్యురాలు స్వప్న, టీడీపీ, జనసేన నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, కూటమి నేతలు పింఛన్లు పంపిణీ చేశారు. **గుడ్లవల్లేరు :** మండలంలో గురువారం 99 శాతం పెన్షన్లు పంపిణీ చేశారు. తెల్లవారు జామున 5 గంటల నుండే సచివాలయ సిబ్బంది పంపిణీ ప్రారంభించగా టీడీపీ నాయకులు తోడుగా నిలిచి సక్రమంగా పంపిణీ చేయించారు. **బంటుమిల్లి :** నాగేశ్వరరావుపేట, అర్తమూరు తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, కాగిత బాలాజీ, తెనాలి సుధాకర్, పోలగాని వాసు, కాగిత రవికుమార్, భూపతి రమేష్, బొల్లా రాంబాబు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న టీడీపీ నాయకులు

● వృద్ధుడికి రూ.4వేల పింఛన్

ఘంటసాల : తనకు 63 సంవత్సరాలని, గత వైసీపీ ప్రభుత్వం తనకు పింఛన్ ఇవ్వలేదని తెలుగురావుపాలెం గ్రామానికి చెందిన పెనుమత్స వెంకట స్వామి ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ నాయకులు టీడీపీ నేత గుత్తికొండ కల్యాణ్, రవిబాబుకు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్షన్ మంజూరు చేయించి ఇప్పిస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నెలబెట్టుకుంటూ అతడికి మంజూరైన సామాజిక పెన్షన్ రూ.4 వేలను పృథ్వీ, శ్రీకాంత్, బాబు ద్వారా వృద్ధుడు వెంకటస్వామికి గురువారం అందజేశారు. కాగా, మండల పరిధిలో గురువారం 98.08 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ తెలిపారు.

ఘనంగా వర్ల రామయ్య జన్మదిన వేడుక

పామర్రు, ఆగస్టు 1 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య జన్మదిన వేడుకలను ఇందిర నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. వర్ల జన్మదిన కేక్‌ను ఆయన తనయుడు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, సుబ్రమణ్యం, వల్లూరిపల్లి గణేష్, మంతెన రామాంజనేయులు, దాలిపర్తి ప్రసాద్, చాట్ల రమేష్, చాట్ల పున్నమ్మ, సందీప్, కేదరాశిపల్లి శ్రీను, రమేష్, ఈడే నాని నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు:** వర్ల రామ య్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ల రామయ్య సేవా సమితి అధ్యక్షుడు తటుకూరి రమణ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలను నాటారు. ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ కుసుమకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న, నెక్కలపూడి మురళీ, జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, గొరిపర్తి గోపయ్య తదితరులు మొక్కలను నాటారు.



పామర్రులో కేక్ కట్ చేస్తున్న వర్ల కుమార్ రాజా



సీయోను వృద్ధాశ్రమంలో అన్నదానం

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య పుట్టినరోజు వేడుకలను ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావ్ అధ్యక్షతన సీయోను వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్ కట్‌చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. తుమ్మల చౌదరిబాబు, మోర్ల రాంబాబు, విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వప్న, తాడికొండ చిన్నా, యార్లగడ్డ శ్రీనివాసరావు, బుల్లా కిషోర్, కైతేపల్లి దాస్, బోలెం నాగమణి, కొమ్మ సుందరరావు, పైడిపాముల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు అమృతం



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు నిజమైన మొదటి టీకా అని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాల వాల్ పోస్టర్ కలెక్టర్ బాలాజీ, జిల్లా వైద్య ఆరోగ్య ఆరోగ్య శాఖాధికారి డా జి గీతాబాయి ఆవిష్కరించారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అమృతం వంటిదన్నారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సతీష్, బి శివసాంబిరెడ్డి, బి.రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉంటే కేసులు ఎత్తివేస్తాం



గుడివాడ రూరల్ : సత్ప్రవర్తన కలిగి ఉంటే ఆరు నెలల్లో కేసులు ఎత్తివేస్తామని డీఎస్పీ శ్రీకాంత్ పేర్కొన్నారు. తాలూకా పోలీస్ గురువారం 110 మంది రౌడీ షీటర్లకు, సస్పెక్ట్‌లకు గుడివాడ సబ్ డివిజన్‌లోని పది పోలీస్ స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్సై ఆధ్వర్యంలో డీఎస్పీ పి.శ్రీకాంత్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని మంచి నడవడికతో సమాజంలో మంచి జీవితం గడపాలని సూచించారు.

ఎరువుల షాపుల తనిఖీ

గుడివాడ రూరల్ : షాపుల్లో కొనుగోలు చేసిన ఎరువులకు రైతులు తప్పని సరిగా రశీదు తీసుకుని భద్రపర్చుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. గుడివాడలోని ఎరువుల షాపులను గురువారం తనిఖీ చేశారు. రశీదులు సక్రమంగా ఉన్నది లేనది యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎటువంటి అనుమానాలు ఉన్నా, ఎరువుల షాపుల డీలర్లు ఎలాంటి ఇబ్బందులు పెట్టినా తమకు తెలియజేయాలని కోరారు. ఏవో అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు ధరల తగ్గింపు

చల్లపల్లి : రైతుబజారు ద్వారా అందిస్తున్న బియ్యం, కందిపప్పు ధరలను మరోసారి తగ్గించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమార్ తెలిపారు. రైతుబజారులో, రిలయన్స్ స్మార్ట్ బజారులో కందిపప్పు రూ.150లకే విక్రయిస్తారనీ, బియ్యం రూ.47, స్టీమ్ రైస్ కిలో రూ.48కి అందిస్తారన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ సంబరాలు



గుడివాడ : ఎస్సీ వర్గీకరణ అధికారం రాష్ట్రాలకు కట్టబెడుతూ సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో రిజర్వేషన్ల అమలులో సరికొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ గుడివాడలో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. వర్గీకరణతో అన్ని ఉపకులాలకు సమాన అవకాశాలు అందుతాయన్నారు. నాయకులు విక్టర్‌పాల్, వెంపటి సైమన్, కలపాల బాబురావు, మామిళ్ళ ఏలీషా, తాళ్ళూరి ప్రశాంత్, కొదమల గంగాధర్, పైడిముక్కల వంశీ, అత్తాటి సాల్మన్, కొడాలి బాబు, గంధం సైమన్‌బాబు, అద్దంకి కమల్, వేశపోగు సుందరయ్య, మామిళ్ళ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ రాజేశ్వరీ కాలనీలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఎమ్మార్పీఎస్ నేత తానంకి పోతురాజు, బీజేపీ నాయకులు కన్నా రాజు, మట్టా శ్రీను, బోనం పాపారావు, బందెల నాగబాబు, బందెల తాతారావు, బందెల సోమేశ్వరరావు, బందెల ఆనంద్ పాల్గొన్నారు. **ఘంటసాల :** సూరపనేనివారిపాలెంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొకినాల కృష్ణ, ఎమ్మార్పీఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కొడాలి డేవిడ్, కొక్కిలిగడ్డ మదన మోహన ప్రసాద్, రాచూరి రాజశేఖర్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

బండిరేవు కోడు పూడికతీయాలి



చల్లపల్లి : చల్లపల్లి పడమర వైపున బండిరేవు కోడు చెత్తతో పూడుకుపోయి మురుగునీటి పారుదలకు అవరోధం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మురుగుకోడులో ప్రజలు, దుకాణదారులు చెత్తను పడవేస్తుండటంతో పూడుకుపోతోంది. దీనికి తోడు గుర్రపుడెక్క దట్టంగా పేరుకుంది. నాట్లువేసిన పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉందని రైతు లు చెబుతున్నారు. గురువారం పలువురు రైతులు, జనసేన నేతలు మురుగుకోడును పరిశీలించారు. గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించి పూడి కతీత చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. మురుగుకోడులో చెత్తను వేయనీయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు కంఠంనేని శోభన్ బాబు, మేకా వెంకటేశ్వరరావు, మండవ పవన్‌కుమార్, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, పసుపులేటి రవికుమార్, గోళ్ల ప్రసాద్, కలపాల ప్రసాద్, అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : బెరాకా సంస్థల వ్యవస్థాపకుడు ఫాదర్ సత్యనారాయణ పేదలకు చేసిన సేవలు మరవలేమని, ఆయన కుమారుడు కిరణ్‌పాల్ వాటిని కొనసాగించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సత్యనారాయణ భౌతికకాయాన్ని గురువారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. కొనకళ్ళ నారాయణరావు, బూరగడ్డ వేదవ్యాస్, బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, అక్కుమహంతి రాజా తదితరులు సత్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సందడిగా ఫ్రెండ్‌షిప్ డే

మచిలీపట్నం టౌన్ : ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే సందడిగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు తుమ్మలపల్లి విశాలక్షి, కార్యదర్శి సామా అపర్ణ, కోశాధికారి మాటూరి శ్రీలక్ష్మి నేతృత్వంలో ఆటపాటలతో ఎంతో ఉల్లాసంగా సందడి చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.



గంగానమ్మ తల్లికి ఆషాఢ సారె

చల్లపల్లి : రామానగరం రామాలయ ప్రాంగణంలోని గంగానమ్మ తల్లికి గురువారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో భారీ ఊరేగింపుగా మహిళలు చీరలు, పూలు, పండ్లు, స్వీట్లు, గాజులు, పసుపు, కుంకుమలు శిరస్సున ధరించి గంగానమ్మ తల్లి ఆలయానికి తరలివచ్చి సారె సమర్పించారు.

అగ్నిబాధితులకు రెడ్‌క్రాస్ సాయం

ఘంటసాల : అగ్నిబాధిత అమృతం బుడ్డిమ్మ, నాంచారమ్మ, యేసమ్మ, వెంకమ్మ కుటుంబాలకు హైజినిక్ కిట్లు, వంట పాత్రలు, బక్కెట్లు, టార్పాలిన్లను రెడ్‌క్రాస్ ప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, జిల్లా కోశాధికారి కొండపల్లి రామ బాలాజీ, కో-ఆర్డినేటర్ ఎస్.హరికృష్ణ, ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ చప్పిడి చిట్టిబాబు, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, మొవ్వ, చల్లపల్లి మండలాల అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, లీలా బ్రహ్మేంద్ర, కావూరి సాల్మన్ పాల్గొన్నారు.

యువత చదవు మాతృదేశానికి ఉపయోగపడాలి



పెడన రూరల్ : యువత తాను అభ్యసించిన విద్య మాతృదేశానికి ఉపయోగపడేలా ఉండాలని రామకృష్ణ మిషన్ (కాన్పూరు) సెక్రటరీ స్వామి ఆత్మ శ్రద్ధానంద అన్నారు. నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఫ్రెషర్స్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రామకృష్ణా మిషన్(విజయవాడ)కు చెందిన స్వామి యజ్ఞపురుషానంద విద్యార్థులు ఆత్మబలం, ఏకాగ్రత ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బి. రాజా శ్రీనివాసరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



పోలాశమ్మకు ఆషాఢ సారె

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డలోని పోలాశమ్మ అమ్మ వారికి గురువారం ఆషాఢ సారె వైభవంగా సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి స్వీట్లు, పసుపు, కుంకుమ, పండ్లు సమర్పించారు. మండలి వెంకటేశ్వరరావు, మండలి వెంకట శేషు, మండలి రామకోటి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

ఘంటసాల : ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చిట్టూర్పులో నార సంచుల తయారీ శిక్షణ ముగింపులో ఎమ్మెల్యే పాల్గొని సర్టిఫికెట్లను అందజేశారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వెంకట్రావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ, తుమ్మల చౌదరిబాబు, వరప్రసాద్, రాజ్యలక్ష్మి, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.51 లక్షలు

గుడివాడ : భూనీల సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లలోని కానుకలను గురువారం డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ సమక్షంలో లెక్కించారు. రూ.5,51,095 ఆదాయం ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

జనసేన నాయకుడి చొరవ

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డలో గన్నవరం నియోజకవర్గానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురి కాగా స్థానిక జనసేన నాయకుడు మండలి శివప్రసాద్ తక్షణం స్పందించారు. గాయపడిన యువకుడిని తక్షణం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తీసుకువచ్చారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి తక్షణమే మెరుగైన వైద్య చికిత్సం కోసం మచిలీపట్నం తరలించారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం

గుడివాడ రూరల్ : గుడివాడ తహసీల్దార్‌గా రామకోటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. **నందివాడ :** నందివాడ తహసీల్దార్‌గా బి.రామానాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గుడ్లవల్లేరు ఎంపీడీవోగా కృష్ణవేణి

గుడ్లవల్లేరు : ఎంపీడీవో డి.కృష్ణవేణి గురువారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణవేణి హైదరాబాద్ హైకోర్టులో ఏవోగా విధులు నిర్వహిస్తూ గుడ్లవల్లేరు ఎంపీడీవోగా నియమితులయ్యారు. సిబ్బంది, స్వాగతం పలికి శుభా కాంక్షలు తెలిపారు. ఈవోపీఆర్డీ దిలీప్ కుమార్, గుడ్లవల్లేరు పంచాయతీ సెక్రటరీ నరసింహారావు, అంగలూరు సెక్రటరీ ఎలీషారావు, డోకిపర్రు సెక్రటరీ రమేష్, పురిటిపాడు సెక్రటరీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.